క్లుప్తంగా

పోలీస్ ఉద్యోగాలు సాధించిన యువకులు

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల విడుదలైన పోలీసు ఉద్యోగాలలో స్థానిక మున్సిపాలిటీ పరిధి చిట్టిరామవరంలో ఇద్దరు యువకులు పోలీసు ఉద్యోగాలు సాధించారు. వ్యవసాయ కూలీలైన బానోత్ జోద్య నాయక్, సోనాలి దంపతుల కుమారుడా హీరాలాల్ (ఏఆర్), ఆటో నడుపుతూ, వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రాము కుమారుడు వంశీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని స్థానికులు అభినందించారు.

ఆర్థిక సాయం



నాగరాజు కుమారుడికి డిపాజిట్ బాండ్‌ను అందజేస్తున్న స్నేహితులు

ఇల్లెందురూరల్: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో మండలంలోని 21ఏరియాకు చెందిన బొల్లెద్దుల నాగరాజు మృతి చెందాడు. మృతుడు నాగరాజు చిన్ననాటి స్నేహితులు ఆదివారం అతని కుమారుడు సార్యకు రూ.2లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను అందజేశారు. స్నేహితులు గెట్ టుగెదర్ ఏర్పాటు చేసుకోవడం, సంబరాలు జరుపుకోవడం, చిట్‌చాట్ చేసుకోవడం కాదని.. ఆపదలో ఉన్న స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకోవడం నిజమైన స్నేహమని నాగరాజు స్నేహితులు అతని కుటుంబానికి ఆర్థిక చేయూతనందించడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. స్నేహితుల ఔదార్యాన్ని స్థానికులు అభినందించారు.

ఇల్లెందు ఏరియాలో పర్యటించిన సీఎంఓ

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత పర్యటించారు. ఆదివారం సింగరేణి ఇల్లెందు ఆస్పత్రిని సందర్శించి అక్కడి ఔట్ పేషెంట్లకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. ఎక్స్‌రే గది, రక్త, మూత్ర పరీక్షలను, మెడికల్ స్టోర్‌ను, పీఎంఈ విభాగాన్ని తనిఖీ చేశారు. ప్రతీరోజు రికార్డులు సక్రమంగా రాసి రిపోర్టులు నమోదు చేయాలని కోరారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్, ఏజీఎం గిరిధర్‌రావు, ఏరియా ఇంజనీర్ నరసింహారాజు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, పర్చేజ్ అధికారి దీలీప్‌కుమార్, డాక్టర్ మల్లారెడ్డి అధికారులు ఉన్నారు.

నేటి నుంచి క్షయ వ్యాధి సేవలు బంద్

టేకులపల్లి: రాష్ట్రంలో నేటి నుంచి క్షయ నిర్ధారణ పరీక్షలు, ఇతర సేవలు నిలిపి వేస్తున్నట్లు ఇల్లెందు డివిజన్ క్షయ అధికారులు శంకర్, సర్వన్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో క్షయ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, జీతాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం వర్తింపజేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని, ఇందులో భాగంగా ఇప్పటికే డీఎంహెచ్‌ఓకు సమ్మె నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీల ఆరాధ్యదైవం కొమురం భీమ్



విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

టేకులపల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం, గోండు వీరుడు కొమురం భీమ్ అని బోడు సర్పంచ్ ఇర్పా లక్ష్మీనారాయణ, తుడుందెబ్బ జాతీయ కోకన్వీనర్ కల్తీ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ఆదివారం బోడు గ్రామంలోని ఆదివాసీల ఆధ్వర్యంలో ఈనెల 29న ప్రతిష్ఠించనున్న కొమురం భీమ్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీక కొమురం భీమ్ స్వయంపాలన, అస్థిత్వ ఉద్యమాల వేగుచుక్క అన్నారు. పోరాట పంథానే చివరకు సరైన మార్గమని, తన జాతి ప్రజలను విముక్తి చేస్తుందని నమ్మిన ఆదివాసీ పోరాట యోధుడు కొమురం భీమ్ విగ్రహాన్ని బోడు గ్రామంలో ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమని, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొర కుంజ సాంబ శివరావు, పటేల్ మాడే బాబు, తుడుందెబ్బ, ఆధార్ సొసైటీ నిర్వాహక కమిటీ నాయకులు చుంచు రామకృష్ణ, బుగ్గ రామనాథం, కుర్స సీతారామ్, జోగా రామబ్రహ్మం, ఈసం రాంబాబు, గొగ్గల రామస్వామి, సనప కోటేశ్వరరావు, రేసు లక్ష్మయ్య, పూజరి వెంకట్, పాయం రత్నం, పాడెం సతీష్ మడే ప్రదీప్, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా?

- బాపూజీనగర్‌లో డ్రెయినేజీలు పనిచేయక దుర్గంధం
- రోడ్డుకు మధ్యలో విద్యుత్ స్తంభాలు
- మిషన్ భగీరథ పైపులైన్ కోసం రోడ్ల ధ్వంసం



బాపూజీనగర్‌లో దెబ్బతిన్న డ్రెయినేజీ

పాల్వంచ: పట్టణంలోని నడిబొడ్డున ఉన్న బాపూజీనగర్‌లో సమస్యలు తిష్టవేశాయి. ఇరుకు రోడ్లు కావడంతో స్థానికులు నిత్యం అవస్థలు పడుతుంటారు. వీధుల్లో అక్కడక్కడా ఆక్రమణకు గురైన ర్యాంపులు, ఇతర నిర్మాణాలు రోడ్డుమీదికొచ్చాయి. ఇక అంబేద్కర్ సెంటర్ నుంచి రిలయన్స్ స్మార్ట్ రోడ్డు, చర్చి వెనుక రోడ్డులో డ్రెయినేజీలన్నీ దెబ్బతిన్నాయి. ఖాళా ప్రాంతాల్లో డ్రెయినేజీల పక్కన భారీగా చెట్ల పొదలు అలుముకుని డ్రెయినేజీల ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఇక అద్దే రోడ్డులో విద్యుత్ స్తంభాలు రోడ్డును ఆక్రమించి మధ్యలో దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక కాంట్రాక్టర్స్ కాలనీ రోడ్డు విస్తరణ అనే అంశం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందనంగా మారింది. ప్రస్తుతం 12 అడుగుల రోడ్డు మాత్రమే ఉంది. దీనిని 40 అడుగులుగా విస్తరించేందుకు ప్రతిపాదనలు పంపించారు కానీ అమలుకు నోచుకోవడం లేదు. ఈ రోడ్డు ద్వారా కాంట్రాక్టర్స్ కాలనీ, బాపూజీనగర్, వెంకటేశ్వర హిల్స్ కాలనీ, జయమ్మకాలనీ, వనమా కాలనీ, వికలాంగుల కాలనీ వాసులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు విస్తరణ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటు అంబేడ్కర్ సెంటర్ రోడ్డు, అటు బస్టాండ్‌కు వెళ్లే రోడ్డులో ఉదయం, సాయంత్రం విద్యార్థులను పాఠశాలలకు పంపించే సమయాల్లో రాకపోకలకు ఇబ్బందులు వర్ణణాతీతంగా మారాయి.

అవస్థలు పడుతున్న స్థానికులు...

ఇరుకు రోడ్లు, డ్రెయినేజీలు సరిగా లేకపోవడం, విద్యుత్ స్తంభాలు అస్తవ్యస్తంగా ఉండటం, పైపులైన్ల లీకేజీలతో అవస్థలు వర్ణణాతీతం. మిషన్ భగీరథ పైపులైన్ల కోసం రోడ్లను ధ్వంసం చేశారు. తిరిగి ఆయా ప్రదేశాల్లో రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో స్థానికులు రాకపోకలకు పడరానిపాట్లు పడుతున్నారు. ఇదిలా ఉండగా పైపులైన్ల లీకేజీల వల్ల తాగునీరు కలుషితం అవుతున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇక రోడ్ల మధ్యలో లింకులు సైతం సరిగా లేకపోవడం, మూలమలుపులు వెడల్పు లేక వాహనాలు తిరిగే పరిస్థితులు కూడా లేవు. వీటిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎన్నికలను దృష్టిలో పలుచోట్ల అభివృద్ధి పనులు చేస్తున్నారు కానీ మా గ్రామాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.



వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం

రోడ్లు ఇరుకుగా ఉన్నాయి



రోడ్లు ఇరుకుగా మారాయి. రిలయన్స్ స్మార్ట్ నుంచి బాపూజీనగర్ మీదుగా కాంట్రాక్టర్స్ కాలనీకి వెళ్లే రోడ్డులో ఆక్రమణలను తొలగించాలి. దెబ్బతిన్న డ్రెయినేజీల స్థానంలో కొత్తగా నిర్మించాలి. రోడ్లు సరిగా లేక ఉదయం, సాయంత్రం పాఠశాలలకు వెళ్లేందుకు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రావడానికి కూడా ఇబ్బందిగా ఉంది.

– ఎం.కిరణ్ కుమార్, బాపూజీనగర్

సమస్యలు పరిష్కరించాలి



రోడ్ల మధ్యలో అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వీటి వల్ల రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చాలి. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. మిషన్ భగీరథ పైపులైన్ల కోసం సీసీ రోడ్డును ధ్వంసం చేశారు. తిరిగి నిర్మించాలి. కాలనీల్లో కుక్కల బెడదల అధికంగా ఉంది. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– రామారావు, బాపూజీనగర్

కొనసాగుతున్న ఆశా వర్కర్ల సమ్మె



జూలూరుపాడులో దీక్షాశిబిరంలో భోజనం చేస్తున్న ఆశా కార్యకర్తలు

టేకులపల్లి: పారితోషకాలు వద్దు.. కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్ల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 14వ రోజుకు చేరింది. ఆశాలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.5లక్షలు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌రూ.5 లక్షలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలన్నింటినీ వర్తింపజేయాలని, ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, మట్టి ఖర్చులు రూ.50వేలు చెల్లించాలని, పారితోషికం లేని అదనపు పనులు చేయించకూడదని కోరారు. 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు 6 నెలల పీఆర్‌సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని 32 రకాల రిజిస్టర్లను ప్రభుత్వం వెంటనే సరఫరా చేయాలని విన్నవించారు. క్వాలిటీతో కూడిన 5 సంవత్సరాల పెండింగ్ యూనిఫాం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మజహరి, చైతన్య, నిర్మల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఆశా వర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం కొనసాగింది. జూలూరుపాడు గ్రామానికి చెందిన సాయిన్ని అనిల్ ఆశా కార్యకర్తలకు దీక్షా శిబిరంలో భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పూనెం ఝాన్సీ, ఆశా వర్కర్లు బి.నీలిమ, శారద, ఏసుమణి, కల్యాణి, కృష్ణవేణి, పద్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



వెంకటయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బగ్గి వెంకటయ్యను కలిశారు. సింగరేణిలో విజిట్ చేసి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సంస్థలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు అనేక సమస్యలపై ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఎస్సీ లైజన్ సెల్ ఏర్పాటు చేస్తాయాలని ఆదేశాలు వచ్చినా వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదని, లైజన్ సెల్ ఏర్పాటు అయ్యే విధంగా ఉన్నతాధికారులతో మాట్లాడాలని విన్నవించారు. రాష్ట్రంలో ఎస్సీ కమిషన్ ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. రేణుగుంట్ల ప్రవీణ్, కొంకటి లక్ష్మీనారాయణ, అసోసియేషన్ ఈర్ల రాజేశ్వరరావు, కనుగుల తిరుపతి పాల్గొన్నారు.

సీఎం గారూ.. మాట నిలబెట్టుకోండి



ఇల్లెందురూరల్: కొమరారంలో బిక్షాటన చేస్తున్న కార్మికులు



టేకులపల్లిలో సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లు

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తమ ఆవేదనను విస్మరించడాన్ని నిరసిస్తూ మండలంలోని కొమరారం గ్రామంలో మధ్యాహ్న భోజన వర్కర్లు బిక్షాటన చేసి నిరసన తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి బిక్షం అర్థించారు. ఈ సందర్భంగా వర్కర్లు మాట్లాడుతూ.. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించిన వేతనాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్లు తనకం పద్మ, బుర్రి పద్మ, మల్లిపెద్ది సలోమి, బాదావత్ సరిత, కొల్ల రాణి, ఇర్పా సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, జీఓ నంబర్ 8 ప్రకారం పెంచిన వేతనాలు ఏరియర్స్‌తో సహా చెల్లించాలని తదితర డిమాండ్ల సాధన కోసం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం కొనసాగించారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, కొత్త మెనూని సవరించాలని, గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, సబ్సిడీ ద్వారా గ్యాస్ ఇవ్వాలని, ప్రమాద బీమా పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఐడీ కార్డులు ఇవ్వాలని, వంట షెడ్లు, వంట పాత్రలు తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

కాటన్ యూనిఫాం ఇవ్వాలని, సామాజిక భద్రత కల్పించాలని, అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలని, రాగి జావ, పదో తరగతి విద్యార్థులకు అల్పాహారంకు వంట చెరుకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈసం రాణెమ్మ, నాగలక్ష్మీ, మంగీ, సింధు, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

పాల్వంచరూరల్: మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి నుంచి జగన్నాథపురం వరకు రూ.2 కోట్ల వ్యయంతో బీసీఎం జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు నేడు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేయనున్నట్లు ఈఓ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం జరగాల్సిన ఈ కార్యక్రమం అనివార్యకారణాల వలన సోమవారానికి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. స్థానికులు పాల్గొనివిజయవంతం చేయాలని కోరారు.


క్రికెట్ పోటీలు ప్రారంభించిన జీఎం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇల్లెందు 24 ఏరియా గ్రౌండ్‌లో గనులు, వివిధ విభాగాల స్థాయి క్రికెట్ పోటీలను ఏరియా జీఎం జాన్ ఆనంద్ ప్రారంభించారు. ఆదివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జీఎం మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం పొందవచ్చని, తమ ప్రతిభ పాటవాలను చాటుకోవడానికి ఇది ఒక వేదిక అన్నారు. ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్ రావు, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, క్వాలిటీ మేనేజర్ యూసఫ్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు కాదు.. ఉపాధి కావాలి



మాట్లాడుతున్న ప్రతాప్

ఇల్లెందు: ప్రతిఏటా బతుకమ్మ పండుగకు ప్రభుత్వం మహిళలకు అందజేస్తున్న చీరల వల్ల ఎలాంటి ఉపయోగం లేదని ప్రజల బతుకులు మారే ఉపాధి మార్గం కావాలని బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ బాదావత్ ప్రతాప్ అన్నారు. ఆదివారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాణ్యత లేని చీరలు ఇవ్వటం వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ప్రభుత్వం చీరలు పంపిణీ కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తోందని, కానీ వాటని 10 శాతం మంది కూడా ఉపయోగించుకోవడం లేదన్నారు. గ్రామాలలో ఎంతోమంది మహిళలు ఎలాంటి ఉపాధి లేకుండా జీవనం సాగిస్తున్నారని వారి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇప్పించి తీర్చిదిద్దితే ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో బీఎస్పీ నేతలు సత్యనారాయణదొర, పప్పుల గోపీనాథ్, లోకేష్, కిరణ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందు: పట్టణంలో సుమారు రూ. 84.16 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే హరిప్రియ ఆదివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, కమిషనర్ నవీన్, ఏఈ కుమారస్వామి, పీఆర్ డీఈ రామకృష్ణ, కౌన్సిలర్లు, పట్టణ, మండల బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మామిడిగూడెం గ్రామపంచాయతీ తీగలంచ గ్రామంలో డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.19 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మామిడిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో అత్యధికంగా సీసీ రోడ్లు మంజూరు చేశామని చెప్పారు. ప్రస్తుతం రహదారులన్నీ నిర్మాణ దశలో ఉన్నాయని, పనులు నాణ్యతతో జరిగేలా స్థానికులు పర్యవేక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటి మౌనిక, ఉపసర్పంచ్ ప్రసూన, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి...

మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సమకూర్చుకున్న వ్యవసాయ అనుబంధ అద్దె యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సూచించారు. సెర్ప్ కార్యాలయంలో కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మాట్లాడుతూ.. వ్యవసాయ అనుబంధ యంత్రాలైన ట్రాక్టర్, రోటోవేటర్, మొక్కజొన్న మర యంత్రం తదితర సామగ్రి అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. వీటి కొనుగోలుకు మండల మహిళా సమాఖ్య 25 శాతం నిధులు కేటాయించగా, బ్యాంకు నుంచి 50 శాతం నిధులు రుణంగా మంజూరయ్యాయని, 25 శాతం సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని మొత్తంగా కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను ఇల్లెందులో రూ.16.65 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. గ్రామాలలో రైతులు ఈ యంత్రాలను తక్కువ అద్దెకు తీసుకొని లాభాలు గడించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఎం దుర్గారావు, సీసీలు, మండల మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాలి



నినాదాలు చేస్తున్న గిరిజన నాయకులు

పాల్వంచ: రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ట్రైబల్ అడ్వైజరీ కమిటీ తీర్మానం చేసి ఏజెన్సీ ఏరియాలో వందశాతం ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బంజారా భవన్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ సంఘ సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం రిజర్వేషన్ పరిగణనలోకి తీసుకోకుండా డీఎస్సీ నోటిఫికేషన్‌పై నిరుద్యోగులకు నష్టం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. వందశాతం రిజర్వేషన్ కోసం ప్రభుత్వంపై ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ఏరియాలోని జీఓ 30 ద్వారా అమలు చేయాలని, ఎస్టీల రిజర్వేషన్లు కేంద్రం 14శాతానికి పెంచాలని, మైదాన ప్రాంతం ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో టీటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు రాములు నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంతులు నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హుస్సేన్ నాయక్, కేశవ్ నాయక్, కుశాల్ నాయక్, బొజ్జ నాయక్, వీరన్న, బాలకృష్ణ, భరత్, రాందాస్, చందూనాయక్, లాలు, నాగేశ్వరరావు, రాందాస్ రాథోడ్, కిషన్, హాథీరామ్, శంకర్, పత్తిలాల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం



ఇల్లెందురూరల్: ఇందిరానగర్‌లో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడే అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం అందుతుందని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. మండలంలోని ఇందిరానగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని చెప్పారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు.

ప్రస్తుత బీఆర్ఎస్ పాలనలో సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ఎలా జరుగుతుందో ప్రజలంతా గమనిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పాయం లలిత, పాయం స్వాతి, కల్తి పద్మ, తాటి చుక్కమ్మ, ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, కాంగ్రెస్ మండల, పట్టణ శాఖల అధ్యక్షులు పులి సైదులు, దొడ్డా డానియల్, మున్సిపల్ మాజీ చైర్మన్ యదల్లపల్లి అనసూర్య, నాయకులు బోళ్ల సూర్యం, మడుగు సాంబమూర్తి, మున్నాభాయ్, మూతి కృష్ణ, సూర్నపాక సత్యనారాయణ, ఐలయ్య, భార్గవ్, ఆముదాల ప్రసాద్, పాయం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మన 'సంక్షేమం' దేశానికే ఆదర్శం



అన్నారుపాడు జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్

జూలూరుపాడు: తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. ఆదివారం అన్నారుపాడు, భోజ్యాతండాలలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అన్నారుపాడులో రూ.20 లక్షలతో నిర్మించిన జీపీ భవనం, రూ.24 లక్షలలో నిర్మించిన సీసీ రోడ్లు, భోజ్యాతండాలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. వైరా నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని, సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో యల్లంకి సత్యనారాయణ, ఎదళ్లపల్లి వీరభద్రం, పొన్నెకంటి సతీష్ కుమార్, నున్నా రంగారావు, లావుడ్యా సోనీ, బానోత్ పద్మ, లావుడ్యా కిషన్ లాల్, రామిశెట్టి రాంబాబు, కొదుమూరి కోటేశ్వరరావు, మోదుగు రామకృష్ణ, పణితి వెంకటేశ్వర్లు, దేవరకొండ కిరణ్, బానోత్ శంకర్, ఎస్కే సుభాని, రామిశెట్టి నాగేశ్వరరావు, తాళ్లూరి రామారావు, గుడిమెట్ల వీరభద్రం, ఇల్లంగి తిరుపతి, మిర్యాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1985-86 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పాల్వంచ: పట్టణంలోని బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985–86 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒక్కచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా భావోద్వేగాలకు గురయ్యారు. చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు పంచుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు ప్రసాదరావు, సాంబశివరావు, రాంమోహన్‌రావు, బ్రహ్మాచారి, పీవీఎన్ సత్యనారాయణ, సరస్వతి, గుణసుందరి, లలిత, కోటేశ్వరి, నాటి విద్యార్థులు బి.వీరభద్రం, ఎస్‌కే.అమీరుద్దీన్, తోట మల్లేశ్, బి.వీరయ్య, సాయికృష్ణ, జి.వీరభద్రం, పి.హరినాథ్, నర్సిరెడ్డి, చక్రధరచారి తదితరులు పాల్గొన్నారు.